# కథ




బస్సు వేగంగా వెడుతోంది. అది రాష్ట్ర రవాణా సంస్థ బస్సు. అవును... సాక్షాత్తూ ప్రజా సేవయే పరమార్థంగా పెట్టుకొన్న ఆర్.టి.సి. బస్సు-కమలాపురం స్టేజి దాటి సుమారు మూడు కిలోమీటర్లు వెళ్ళిన తరువాత కండక్టర్ వెనుక మూడవ సీటులో కూర్చున్న ఒక వ్యవసాయ కూలీ లాగా కనిపిస్తున్న ఆసామీ హఠాత్తుగా లేచి కండక్టర్ వద్దకు వచ్చాడు.

"ఒక్కసారి ఆపండి బాబయ్యా. నేనిక్కడ దిగాలి" అన్నాడు.

"ఇక్కడెలా కుదురుతుందయ్యా ఇంకో మూడు మైళ్ళు పోతే గాని స్టేజి రాదు. అక్కడ దిగుదువు గానిలే కూర్చో" అన్నాడు కండక్టర్.

"మా యజమాని పొలం ఇక్కడే బాబయ్యా మీరు మూడు మైళ్ళు పోయాక దింపితే ఈ మూడు మైళ్ళు వెనక్కు నడిచి రావాలి. ఒక్క నిముషం ఆపించండి బాబయ్యా దిగిపోతాను" అంటూ ప్రాధేయపడ్డాడు ఆసామీ.

"కుదరదు అని చెబితే వినవేమయ్యా. మధ్యలో బస్సాపడం వీలు కాదు. స్టేజి వచ్చాక దిగాల్సిందే" అన్నాడు కండక్టర్.

"టికెట్ ఎదరకే తీసాను బాబయ్యా. మా యజమాని వుండేదీ పొలిలోనే. ఆయనకు భోజనం తీసికెళుతున్నాను. ఇక్కడ కాస్త ఆపండి బాబయ్యా" అంటూ బతిమాలసాగాడు ఆసామీ.

అతను అలా బతిమాలుతూనే వున్నాడు. బస్సు ముందుకు దూసుకుపోతూనే వుంది. ఆ ఆసామీ కండక్టర్‌ను వేడుకొంటూనే వున్నాడు. కాని కండక్టర్ ఏ మాత్రం కరగలేదు!

ఇంతలో ధర్మవరం వచ్చింది. బస్సాగింది. బస్సులోంచి దిగిన ఆ పల్లెటూరి ఆసామీ భోజనం క్యారేజీ చేత్తో పట్టుకొని వెనక్కు మూడు మైళ్ళు తన యజమాని పొలం వైపు నడవడం ప్రారంభించాడు ఆ మండుటెండలో.

"అదేమి రంగన్నా! ఇంత ఆలస్యమైంది?" క్యారియర్ తెచ్చిన రంగన్నను అడిగాడు అతని భూకామందు ఆనందరావు.

"కండక్టర్ ఇక్కడ బస్సాపమంటే ఆపలేదు బాబయ్యా. ముందు స్టేజిలో దిగి వెనక్కు ఈ మూడు మైళ్ళు నడిచొచ్చానండి" అని బదులిచ్చాడు రంగన్న.

"ఇదేంటి రంగన్నా! నీకు కావల్సిన చోట బస్సాపించుకొనే ఆ మాత్రం తెలివి కూడా లేపోతే ఎలాగయ్యా?" అన్నాడు నవ్వుతూ ఆనందరావు.

"అదేటి బాబయ్యా. ఎంత బతిమాలినా ఆ కండక్టరోడు ఆపితేనా?" అన్నాడు రంగన్న.

"బుర్రుపయోగించాలయ్యా. కొంచెం కూడా తెలివి లేపోతే ఎలా చెప్పు? తెలివి తేటలు చూపిస్తే ఈ దేశంలో సాధించలేనిది ఏమీ లేదయ్యా" అన్నాడు ఆనందరావు.

"ఏమో బాబయ్యా. మన పొలం కుప్ప నూర్పు అయ్యేసరికి కనీసం నెలా పదిహేనురోజు లైనా పడుతుంది. అన్ని రోజులూ ఇక్కడ బస్సు ఆపక పోతే నా పని రోజూ నడకే" అన్నాడు ఆందోళనగా రంగన్న.

"నువ్వు నడవక్కరలేదయ్యా. నేనో వుపాయం చెప్తాను. అలా చెయ్యి" అన్నాడు ఆనందరావు.

* * * *

బస్సు వేగంగా ప్రయాణిస్తోంది. యజమాని పొలం సమీపించగానే రోజూ లాగే రంగన్న కండక్టర్ వద్దకు వచ్చి నిలబడ్డాడు.

"బాబయ్యా! ఒకసారి బస్సాపండి" అని కంగారుగా అన్నాడు రంగన్న (నటిస్తూ).

"ఇక్కడ కాదయ్యా. స్టేజి రావాల్సిందే" అన్నాడు కండక్టర్.

"అది కాదు బాబయ్యా! నా చేతిలో టికెట్ గాలికెగిరి కిటికీలోంచి పడిపోయింది"

"హోల్డాన్" కంగారుగా అరిచాడు కండక్టర్.

"ఛనేవాడివేనయ్యా! ఇలా కిటికీ లోంచి టిక్కెట్లు పారేస్తే మా ఉద్యోగాలూడతాయి. అయినా టిక్కెట్ జేబులో పెట్టుకోడం తెలియదా? చేతిలో ఎందుకయ్యా? దిగు. దిగు. దిగి టికెట్ వెతుక్కో"

చేతిలో క్యారియర్‌తో సహా దిగిపోయాడు రంగన్న. దిగిపోయాక చెప్పాడు.

"బస్సు పోనియ్యండి బాబయ్యా! టికెట్ ఎటెగిరిపోయిందో ఏమిటో? నేను నడిచి వస్తాన్లెండి"

"రైట్ రైట్ పోనియ్" విసుగ్గా డ్రైవర్‌కు చెప్పాడు కండక్టర్.

తన యజమాని చెప్పిన టెక్నిక్ పని చేసినందుకు మనసులోనే సంతోషిస్తూ పొలం వైపు నడిచాడు రంగన్న.

* * * *

బస్సు వేగంగా వెళుతోంది. ఈ రోజు కూడా రంగన్న తన యజమాని పొలం సమీపించగానే వెనక సీటుల్లో కూర్చున్న రంగన్న గాబరాగా అరిచాడు.

"బాబయ్యా! కండక్టర్ గారూ! బస్సాపండి బాబూ! నా డబ్బులు పడిపోయాయి"

"ఎంతయ్యా?" అడిగాడు పక్క సీట్లోని వ్యక్తి.

"వంద రూపాయిలండి బాబూ! లెక్క పెట్టుకుంటుంటే కిటికీ లోంచి గాలి కెగిరిపోయిందండి" అంటూ గాబరాగా చెప్పాడు రంగన్న.

"ఏమండోయ్ కండక్టర్ గారూ! కాస్త బస్సాపండి. ఇతనివి వంద రూపాయిలు పడిపోయాయిట" అంటూ నలుగురైదుగురు ప్రయాణికులు ఒక్కసారిగా అరిచారు.

వెంటనే "హోల్డాన్" అని విసుగ్గా అరిచాడు కండక్టర్.

చేతిలో క్యారియర్‌తో బస్సు దిగాడు రంగన్న. దిగుతూ "డబ్బు వెతుక్కుని నే వెనకాల వస్తాను బాబయ్యా. బస్సు పోనీయండి" అన్నాడు రంగన్న.

బస్సు కదిలింది.

ఇలా రోజూ ఏదో టెక్నిక్‌తో రంగన్న తన యజమాని పొలం వద్దనే బస్సాపించుకుంటున్నాడు.

అవును మరి. మన బస్సుల్లో రోజూ ఒకే కండక్టర్ వుండడు కదా! రంగన్న రోజూ ఈ 'టెక్నిక్'లే ఉపయోగించి తనకు కావల్సిన చోట బస్సు దిగుతున్నాడని ఆ కండక్టర్లకు ఎలా తెలుస్తుంది? ●